# పాకిస్తాన్ మొట్టమొదటి న్యాయ మరియు కార్మిక శాఖా మంత్రి
# శ్రీ జోగేంద్రనాథ్ మండల్ రాజీనామా లేఖ

జోగేంద్ర నాథ్ మండల్ (1904-1968) వంగ దేశస్థుడు. నేటి బంగ్లాదేశ్‌లో జన్మించారు. వంగ దేశపు మేధావులలో ఒకరు. దళిత నాయకులు. ముస్లిం లీగ్‌కు సహకరించి, బెంగాల్ విభజనకు, ఆ తర్వాత దేశ విభజనకు షెడ్యూల్డ్ కులాల వారి మద్దతును కూడగట్టారు. పాకిస్థాన్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించటంతో పాటు పాకిస్థాన్ రాజ్యాంగసభకు అధ్యక్షుడిగా పనిచేశారు. పాకిస్థాన్ మొట్టమొదటి న్యాయ, కార్మిక శాఖా మంత్రిగా రాజీనామా చేసే వరకు 1948 ఆగష్టు 15 నుండి అక్టోబరు 8, 1950 వరకు పనిచేసారు. కాశ్మీర్ వ్యవహారాలనూ సైతం పర్యవేక్షించారు. డా॥ అంబేద్కర్ ముఖ్య సహచరులలో ఒకరు. బెంగాల్ నుండి అంబేద్కర్ రాజ్యాంగసభకు ఎన్నిక అవటానికి సహకారం అందించారు. అంబేద్కర్‌తో కలసి బెంగాల్‌లో షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్‌ను నెలకొల్పారు. అయితే అంబేద్కర్‌తో విభేదించి పాకిస్థాన్‌లోనే దళితులకు భద్రత, సమాన అవకాశాలు ఉంటాయని నమ్మి, ముస్లిం లీగ్‌కు, ఆ తర్వాత పాకిస్థాన్‌కు తిరుగులేని మద్దతును ఇచ్చారు. పాకిస్థాన్‌కు వలస వెళ్ళారు. 3 సం॥ల తర్వాత అక్కడి హిందువులు,షెడ్యూల్డ్ కులాల వారి పై జరుగుతున్న అత్యాచారాలకు, అణచివేతకు గుండెపగిలి భారతదేశానికి తిరిగి వచ్చారు. పాక్ ప్రధానికి లియాఖత్ అలీ ఖాన్‌కు 1950 అక్టోబరు 8న తన రాజీనామా లేఖను పంపారు.

**ప్రియమైన ప్రధాన మంత్రి గారికి,**

తూర్పు బెంగాల్‌కు చెందిన వెనుకబడ్డ హిందూ ప్రజలను ఉద్ధరించాలనేది నా జీవన లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో ఘోరంగా విఫలమై, బరువెక్కిన హృదయంతో, నిరాశానిస్పృహలకు లోనై మీ మంత్రి మండలి నుండి రాజీనామా చేస్తున్నాను. ఉపఖండంలో ప్రస్తుతం నెలకొన్న చారిత్రాత్మక పరిస్థితుల్లో నా రాజీనామాకు దారితీసిన పరిస్థితులను సవివరంగా చెప్పటం సబబుగా ఉంటుందని భావించి ఈ లేఖ వ్రాస్తున్నాను.

**ముస్లిం లీగ్‌కు మద్దతు:**

నా రాజీనామాకు దారితీసిన మూలకారణాలను, సత్వర కారణాలను వివరించేముందు ముస్లింలీగ్‌తో నా సహకారం గురించిన నేపథ్యాన్ని వివరించటం అవసరమని నేను భావిస్తున్నాను. 1943 ఫిబ్రవరిలో ముస్లిం లీగ్‌కు చెందిన కొందరు ప్రముఖ నాయకులు బెంగాల్ విధాన సభలో నా సహకారాన్ని అర్థించారు. 1943 మార్చిలో ఫజుల్ హక్ మంత్రి వర్గం పడిపోయింది. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఇరవైఒక్క మంది శాసన సభ్యులతో నేను ముస్లిం లీగ్ నాయకుడైన క్వాజీ నజీముద్దీన్‌కు సహకారం అందించటానికి అంగీకరించాను. దానితో 1943 ఏప్రిల్‌లో ఆయన అధికారంలోకి వచ్చారు. నేను ముస్లిం లీగ్‌కు ఇచ్చిన సహకారం షరతులు లేనిది కాదు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ముగ్గురిని మంత్రులుగా నియమించాలని, ప్రతీ ఏటా ఐదు లక్షల రూపాయలు షెడ్యూల్డ్ కులాల వారి విద్యా వ్యాప్తి కోసం గ్రాంట్‌గా ఇవ్వాలని, ప్రభుత్వ నియామకాల్లో కులపరమైన కోటాను తు.చ. తప్పకుండా అమలు చెయ్యాలి అనేవి షరతులు. అందుకు వారు అంగీకరించారు.

ఈ షరతులను వారు అంగీకరించినందువలననే కాక, మరికొన్ని ఇతర కారణాల వలన నేను ముస్లిం లీగ్‌కు సహకారం అందించాను. బెంగాల్‌లో ముస్లింలు, షెడ్యూల్డ్ కులాల వారి వృత్తులు, ఆర్థిక అవసరాలు ఇంచుమించుగా ఒక్కటే. ఇరు వర్గాల్లోను రైతులు ఉన్నారు, కూలీలు ఉన్నారు. ఇరు వర్గాల్లోనూ కొందరు మత్స్య కారులు ఉన్నారు. ఇరువర్గాల వారు విద్య విషయకంగా బాగా వెనుకపడి ఉన్నారు. ముస్లిం లీగ్‌తో నా సహకారం వలన బెంగాల్ జనాభాలో

అత్యధికులైన ముస్లింలు, షెడ్యూల్డ్ కులాల వారి సంక్షేమం, సమృద్ధి కోసం పనిచేయవచ్చునని, పాలనాపరంగా, శాసనా పరంగా అభివృద్ధి నిరోధకుల పునాదులను పెకిలించవచ్చునని నాకు నచ్చజెప్పారు. అంతేకాక, నా ఈ సహకారం వలన మత సామరస్యం నెలకొంటుందని హిందువులు, ముస్లింలు కలసి మెలసి జీవించవచ్చునని నాకు నచ్చచెప్పారు. దానితో నేను సహకారం అందించాను. నిజాముద్దీన్ ఇచ్చిన మాట ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు చెందిన ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసుకున్నాడు. మరో ముగ్గురిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించాడు.

**'ప్రత్యక్ష చర్య 'తరువాత కూడా కొనసాగిన సహకారం:**

1946 సాధారణ ఎన్నికల తరువాత సుహ్రావర్దీ నాయకత్వంలో బెంగాల్‌లో లీగ్ మంత్రి వర్గం ఏర్పాటైంది. ఫెడరేషన్ టిక్కెట్ మీద నేను ఒక్కడినే షెడ్యూల్డ్ కులాల నుండి ఎన్నికైన వాడిని. నన్ను కేబినెట్‌లోకి తీసుకున్నారు. 1946 ఆగష్టు 16న ముస్లిం లీగ్ 'ప్రత్యక్ష చర్య'కు దిగింది. అది తీవ్ర మారణహోమానికి దారితీసింది. హిందువులను విచక్షణారహితంగా ముస్లిం గూండాలూ చంపారు.దానితో మంత్రివర్గం నుండి నన్ను రాజీనామా చెయ్యమని హిందువులు డిమాండ్ చేశారు. నాకు నిత్యమూ బెదిరింపు లేఖలు వచ్చేవి. కాని నేను బెదిరింపులకు లొంగలేదు. రాజీనామా చెయ్యలేదు. నా విధానాలను అంటిపెట్టుకొని ముస్లిం లీగ్‌కు సహకారం అందించాను. అంతేకాక నా పత్రిక 'జాగరణ' ద్వారా కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల మధ్య జరుగుతున్న ఘర్షణలకు దూరంగా ఉండమని షెడ్యూల్డ్ కులాల వారిని హెచ్చరించాను.

1946 అక్టోబర్‌లో నవకాళిలో చెలరేగిన మత ఘర్షణలు తీవ్ర రూపం దాల్చాయి. వేలాది మంది హిందువులను ముస్లింలు నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. వందలాది మందిని బలవంతంగా ఇస్లాంలోకి మార్చారు. వారిలో అనేక మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అనేక మంది హిందూ స్త్రీలను చెరపట్టారు, మానభంగం చేశారు. ఆస్తి నష్టం, ప్రాణ నష్టం విపరీతంగా జరిగింది. మత సంఘర్షణలు జరిగిన ఈ ప్రాంతాలను నేను సందర్శించాను. హిందువులపై జరిగిన అత్యాచారాలు, అవమానాలు వర్ణనాతీతమైనవి. వారి బాధలు నన్ను బాగా కదిలించాయి. అయినా ముస్లిం లీగ్‌తో నా సహకారాన్ని కొనసాగించాను. కలకత్తాలో జరిగిన సామూహిక హిందూ హత్యా కాండ తరువాత సుహ్రావర్దీ మంత్రి వర్గం మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. నా ప్రయత్నం వలన నలుగురు ఆంగ్లో ఇండియన్ సభ్యులు, కాంగ్రెస్‌కు చెందిన షెడ్యూల్డ్ కులాలకు చెందిన నలుగురు శాసనసభ్యులు ఆ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయటంతో ఆ తీర్మానం వీగిపోయింది.

**మధ్యంతర ప్రభుత్వంలో ప్రాతినిధ్యం:**

1946 అక్టోబర్‌లో సుహ్రావర్దీ నుండి ఒక ప్రతిపాదన వచ్చింది. కేంద్రంలో ఏర్పాటు చేయబోయే మధ్యంతర ప్రభుత్వంలో నాకు స్థానం ఇవ్వనున్నట్లుగా ఆయన చెప్పారు. నాకు ఆలోచించుకోవటానికి ఒక గంట సమయం మాత్రమే ఇచ్చారు. రాజీనామా చేసే స్వతంత్రం నాకు ఉండాలన్న షరతును పెట్టాను. ఎందుకంటే మా నాయకుడు డా॥ అంబేద్కర్ అప్పుడు దేశంలో లేరు. ఆయన అనుమతి లేకుండా మంత్రి వర్గంలో నేను చేరలేను. అదృష్టం కొద్దీ డా॥ అంబేద్కర్ లండన్ నుండి కేబుల్ ద్వారా తన సమ్మతిని తెలియచేశారు. మధ్యంతర ప్రభుత్వంలో చేరటానికి ఢిల్లీ వెళ్లే ముందు సుహ్రావర్దీని కలిసి నా స్థానంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఇద్దరిని రాష్ట్ర మంత్రివర్గంలో తీసుకొమ్మని, మరొక ఇద్దరిని పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించమని కోరాను.

1946 నవంబరు 1న కేంద్రంలో మధ్యంతర ప్రభుత్వంలో చేరాను. ఒక నెల తరువాత కలకత్తా వచ్చినపుడు సుహ్రావర్దీని కలిశాను. తూర్పు బెంగాల్‌లో అన్ని ప్రాంతాలలో హిందూ ముస్లిం ఘర్షణలు నిత్యకృత్యాలయ్యాయని, గోపాల్ గంజ్ ప్రాంతంలో నామశూద్రులు, ముస్లింల మధ్య సయోధ్య కుదర్చమని ఆయన నన్ను కోరాడు. నామశూద్రులు ముస్లిం మీద ప్రతీకారం తీర్చుకోవడానికి పెద్ద ఎత్తున సంసిద్ధులై ఉన్నారు. నేను గోపాల్ గంజ్ ప్రాంతంలో పర్యటించి ఒక

డజను సమావేశాల్లో ప్రసంగించి నామశూద్రులను శాంతింపచేశాను. దానితో పెద్ద పెట్టున జరగవలసి ఉన్న ఘర్షణలు నివారింపబడ్డాయి.

**దేశ విభజన ప్రతిపాదన:**

1947 జూన్ 3న బ్రిటిషు ప్రభుత్వం దేశ విభజనకు ప్రతిపాదన చేసింది. దేశమంతటా హిందువులు ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. ముస్లింలీగ్ పాకిస్థాన్ డిమాండ్‌ను నేను ఎప్పుడూ పట్టించుకోలేదు. కాంగ్రెసుతో బేరం ఆడటానికి, అధికారంలో ఎక్కువ ప్రాతినిధ్యం కోసం చేసిన డిమాండ్‌గా నేను భావించాను. సవర్ణ హిందువుల దురహంకారం, జాత్యాభిమానం పట్ల ముస్లింలకు ఉన్న అనుమానాలు సరైనవని నేను అనుకున్నప్పటికి, పాకిస్థాన్ ఏర్పాటు వలన ఏ సమస్యకు పరిష్కారం లభిస్తుందని నేను అనుకోలేదు. దేశ విభజన మత విద్వేషాలను మరింతగా పెంపు చేస్తుందని, దాని వలన పాక్ ముస్లిం పరిస్థితులు కూడా మెరుగు పడవని, రెండు ప్రాంతాలలోని సామాన్యుల పేదరికం, నిరక్షరాస్యత పోవని, వారి దుర్భర జీవన పరిస్థితులు మెరుగుపడవని నేను భావించాను. పైపెచ్చు దేశ విభజన వలన పాకిస్థాన్ దక్షిణ ఆసియాలోనే ఒక వెనుక బడ్డ దేశంగా, అభివృద్ధికి ఏ మాత్రం నోచుకోని దేశంగా మిగిలిపోతుందని నా నమ్మకం.

**హామీల ఉల్లంఘన:**

షరియత్‌కు, ఇతర ఇస్లామిక్ ఆదేశాలకు అనుగుణంగా పాకిస్థాన్‌లో ఒక ఇస్లామిక్ రాజ్యాన్ని నెలకొల్పుతారని నేను అప్పట్లో అనుకోలేదు. 1940, మార్చి 23న లాహోర్‌లో చేసిన తీర్మానం ప్రకారం పాకిస్థాన్ ఏర్పాటు అవుతుందని భావించాను. దాని ప్రకారం వాయవ్య, తూర్పు ముస్లిమ్ మెజారిటీ ప్రాంతాలలో రెండు స్వతంత్ర దేశాలు ఏర్పాటు చెయ్యాలి. ఈ దేశాల వివిధ ప్రాంతాలకు కూడా స్వతంత్ర, సార్వభౌమాధికారం ఉంటాయి. అల్ప సంఖ్యాకులకు అన్ని విషయాలలోనూ పూర్తి భద్రత ఉంటుంది. వారికి అధిక సంఖ్యాకులతో పాటుగా అన్ని హక్కులు ఉంటాయి. అల్ప సంఖ్యాకుల అభీష్టం మేరకే రాజ్యాంగంలో తగిన ప్రకరణాలు చేయబడతాయి. నేను ఈ తీర్మానాన్ని నమ్మాను. అంతేకాక ఆగస్టు 11న రాజ్యసభ అధ్యక్షుడిగా మహమ్మద్ ఆలీ జిన్నా హిందువులు, ముస్లింలకు మధ్య తారతమ్యం చూపబోమని, అందరూ పాకిస్థానీయులేనని, మత ప్రాతిపదికన పౌరులను విభజించబోమని హామీ ఇచ్చారు. ఇస్లామిక్ రాజ్యం, ముస్లింల దయాదాక్షిణ్యాల మీద జిమ్మీలు ఆధారపడవలసిన పని లేదని జిన్నా చెప్పిన హామీను నమ్మాను. అయితే ఇందులోని ప్రతి హామీను, ఇచ్చిన ప్రతి మాటను బహిరంగంగా మీ కళ్ళముందే ఉల్లంఘిస్తూ అల్ప సంఖ్యాకులను అవమానం పాలు చేశారు. అభద్రతకు గురిచేశారు. అయినా మీరేమీ చెయ్యలేదు.

**బెంగాల్ విభజన:**

ఈ సందర్భంలో ఒక విషయం చెప్పాలి. బెంగాల్ విభజనను నేను వ్యతిరేకించాను. బెంగాల్ విభజనకు అనుకూలంగా ఒక ఉద్యమం బయలుదేరినప్పుడు నేను అనేక అవమానాలకు గురిఅయ్యాను. హిందువులు భరించరాని తిట్లు, శాపనార్థాలు పెట్టారు. 32 కోట్ల మంది హిందువులు వ్యతిరేకించినా కూడా పాకిస్థాన్ ప్రతిపాదన పట్ల నా విధేయత చెక్కుచెదరలేదు. పాకిస్థాన్‌లోని 70 లక్షల మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజలు నా విన్నపాన్ని మన్నించినందుకు వారికి సర్వదా కృతజ్ఞుడ్ని. వారు నాకు తిరుగులేని మద్దతును, ప్రోత్సాహాన్ని ఇచ్చారు.

1947 ఆగస్టు 14న పాకిస్థాన్‌ను ఏర్పాటు చేసిన తర్వాత మీరు మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. నన్ను ఆ మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. క్వాజీ నజీముద్దీన్ తూర్పు బెంగాల్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. ఆగస్టు 10న, కరాచీలో నజీముద్దీన్‌ను కలసి ఇద్దరు మంత్రులను షెడ్యూల్డ్ కులాల నుండి తీసుకొమ్మని కోరాను. కొన్నాళ్ళ తరువాత అలాగే చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అయితే ఆ తర్వాత జరిగిన విషయాలు అత్యంత విచారకరమైనవి. మీతోనూ, నజీముద్దీన్‌తోనూ నురుల్ అమీన్‌తోనూ అనేక సార్లు ఈ విషయమైన ప్రస్తావన చేశాను. నజీముద్దీన్ షెడ్యూల్డ్ కులాల

వారిని మంత్రి వర్గంలోకి తీసుకొనే విషయమై తాత్సారం చేస్తూ కాలయాపన చేస్తున్న విషయాన్ని గమనించి, పాకిస్థాన్ ముస్లింలీగ్ అధ్యక్షుడితోనూ, తూర్పు బెంగాల్ ముస్లింలీగ్ అధ్యక్షుడితోనూ మాట్లాడాను. మీ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకొని వచ్చాను. మీ నివాసంలో నజీముద్దీన్‌తో నా ఎదుటే మీరు మాట్లాడారు. ఢాకా వెళ్ళగానే కనీసం ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకుంటానని ఆయన చెప్పారు. ఒక నెలలోపలే షెడ్యూల్డ్ కులానికి చెందిన ఒకరిని తీసుకొంటామని హామీ ఇచ్చారు. కాని అలా జరగలేదు. బహుశా మీరు చెప్పింది వేరు.you did not mean what you said.నజీముద్దీన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. నురుల్ అమీన్ ఆ తర్వాత తూర్పు బెంగాల్ ముఖ్యమంత్రి అయ్యాక, తిరిగి ఆయన వద్ద ఈ విషయం ప్రస్తావించాను. ఆయన స్పందన కూడా అలాగే ఉంది. నేను తిరిగి ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకొనివచ్చాను. మీరు నాకు హామీ ఇవ్వటమే కాక రెండు మూడు పేర్లు ఇమ్మని అడిగారు. ముగ్గురి పేర్లు మీకు పంపాను. ఢాకా నుండి మీరు తిరిగి వచ్చిన తర్వాత మిమ్మల్ని కలసి విషయం ప్రస్తావిస్తే "నురుల్ అమీన్‌ను ఢిల్లీ నుండి తిరిగి రానివ్వండి" అని అన్నారు. కాని ఆ తరువాత ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. అనేక సార్లు మీకు ఈ విషయమై విజ్ఞప్తి చేసినప్పటికి ఫలితం లేకపోయింది.

**హిందూ వ్యతిరేక విధానం:**

బెంగాల్ విభజన ప్రతిపాదన కార్యరూపం దాల్చుతున్నప్పుడు షెడ్యూల్డ్ కులాల వారు విభజన వల్ల జరిగే ప్రమాదం గురించి ఆందోళన చెందారు. అప్పటి బెంగాల్ ముఖ్యమంత్రి సుహ్రావర్ది దృష్టికి వారి భయాలను, ఆందోళనలను తెస్తే వారు ఒక పత్రికా ప్రకటన చేశారు. అప్పటి వరకు షెడ్యూల్డ్ కులాలు వారు అనుభవిస్తున్న హక్కులు, సదుపాయాలు విభజన అనంతరం కూడా కొనసాగటమే కాక, అదనపు హక్కులు, సదుపాయాలు కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీని ఆయన వ్యక్తిగత హోదాతో పాటు, లీగ్ బెంగాల్ ముఖ్యమంత్రిగా కూడా ఇచ్చాడు. కాని ఏ విషయంలోనూ పాకిస్థాన్‌లో షెడ్యూల్డ్ కులాల వారికి న్యాయం జరగలేదు. మీకు జ్ఞప్తి ఉండే ఉంటుంది. అడపాదడపా షెడ్యూల్డ్ కులాల వారి బాధలు, ఇబ్బందులు మీ దృష్టికి తీసుకొని వస్తూనే ఉన్నాను. తూర్పు బెంగాల్‌లో పాలన ఎంత అస్తవ్యస్తంగా ఉందో కూడా మీ దృష్టికి తెచ్చాను. ముఖ్యంగా తూర్పు బెంగాల్ పోలీసుల అసమర్థత, ఆశ్రిత పక్షపాతం, హిందూ వ్యతిరేకతను గురించి నేను తీవ్రమైన ఆరోపణలను మీ దృష్టికి తెచ్చాను. ఎందుకూ కొరగాని అల్పమైన అంశాలను ఆధారంగా చేసుకొని వారు హిందువులపై కాలు దువ్వేవారు. వారి పట్ల దారుణంగా ప్రవర్తించేవారు. తూర్పు బెంగాల్ ప్రభుత్వం అనుసరిస్తున్న హిందూ వ్యతిరేక విధానాల గురించి మీకు విడమర్చి చెప్పాను.

**హిందువులపై అత్యాచారాలు:**

గోపాల్‌గంజ్‌కు సమీపంలోని ఒక గ్రామంలో ఒక ముస్లిం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా, స్థానిక నామ శూద్రులపై దారుణ అత్యాచారాలు చేశారు. వాస్తవంగా జరిగింది వేరు. ఒక ముస్లిం తన బోటులో వెళుతూ చేపలు పట్టేందుకు వల విసిరాడు. ఆ సరికే అదే పనిలో అదే చోట నిమగ్నమై ఉన్న ఒక నామ శూద్రుడు ఇందుకు అభ్యంతరం చెప్పాడు. దానితో ఆగ్రహించిన ఆ ముస్లిం పక్కనున్న ముస్లిం గ్రామానికి వెళ్ళి ఫిర్యాదు చేశాడు. అదే సమయంలో గోపాల్ గంజ్ సబ్ డివిజనల్ ఆఫీసరు బోటులో ప్రయాణం చేస్తూ అటుగా వచ్చాడు. నిజానిజాలు విచారించకుండా ఆ నామశూద్రుడ్ని పట్టి తెమ్మని పోలీసులను పంపాడు. పోలీసులు, కొందరు ముస్లింలు నామశూద్రుల ఇళ్ళపై దాడి చేసి, ఆడవాళ్ళని, మగవాళ్ళని చిత్తుగా కొట్టి దోచుకొని ఇళ్ళు తగలబెట్టారు. ఒక నిండు గర్భవతిని విచక్షణారహితంగా కొట్టటంతో, ఆమెకు అక్కడే గర్భస్రావం అయింది. దారుణమైన ఈ చర్యతో స్థానికులు భయాందోళనలకు గురి అయ్యారు.

ఇలాంటి దారుణ సంఘటనే 1949లో బరిసాల్ జిల్లాలో జరిగింది. స్థానిక పంచాయితీలో రెండు వర్గాల మధ్య చిన్న తగాదా జరిగింది. ముస్లిం వర్గం వారు రెండవ వర్గాన్ని పోలీసుల సహాయంతో దెబ్బకొట్టాలనుకొన్నారు. దానితో

పోలీసు స్టేషన్‌పై ప్రత్యర్థి వర్గం వారు దాడి చేశారని ఫిర్యాదును ఇచ్చారు. ఆ తప్పుడు ఫిర్యాదును అంగీకరించి, జిల్లా కేంద్రం నుండి అదనపు బలగాలను రప్పించి, హిందువుల ఇళ్ళపై దాడి చేసి, వారిని తీవ్రంగా హింసించారు.వారి విలువైన వస్తువులను కొల్లగొట్టారు. ఊళ్ళో లేని వారి ఇళ్ళను, రాజకీయాల్లో ఎప్పుడూ లేని వారి ఇళ్ళను సైతం దోచుకున్నారు.హైస్కూలు విద్యార్థులలో అనేక మందిని కమ్యూనిస్టు సానుభూతిపరులుగా ముద్ర వేసి, వారిని అనవసరంగా హింసించారు. ఆ గ్రామం నా స్వంత గ్రామానికి దగ్గరగా ఉండటంలో అక్కడి వారు నాకు ఫిర్యాదు చేశారు. నిష్పక్ష విచారణ జరపమని జిల్లా అధికారులకు వ్రాశాను. స్థానికులు కూడా విచారణ జరపమని కోరారు. కాని ఏమీ జరగలేదు. నా ఉత్తరం అధికారులకు చేరినట్లుగా కూడా వారు జవాబు ఇవ్వలేదు. ఆ తర్వాత నేను పాకిస్థాన్‌లో అత్యుత్తమ అధికారి అయిన (ప్రధానమంత్రి) మీ దృష్టికి తెచ్చాను. కాని న్యాయం జరగలేదు.

**పాక్ సైనికుల అత్యాచారాలు:**

స్లీటు జిల్లాలో హర్ బింగర్ షెడ్యూల్డ్ కులాల వారిపై, హిందువులపై జరిగిన అత్యాచారాలు గురించి సవివరంగా చెప్పాలి. అమాయకులైన మగవారిని, ఆడవారిని దారుణంగా చిత్రహింసల పాలు చేశారు. పోలీసులు, ముస్లింలు హిందువుల ఇళ్ళపై దాడి చేసి దోచుకునేవారు. అడ్డు వచ్చే వారిని కొట్టేవారు. మిలటరీ పోలీసులను అక్కడ నియమించారు. అణచివేతకు వారు మారుపేరు. శాంతి భద్రతలు కాపాడవలసిన వారే హిందువుల ఇళ్ళపై పడి దోచుకున్నారు. వారి స్త్రీలపై కన్ను వేసి రాత్రి సమయంలో తమ దగ్గరకు తమ కోర్కెలు తీర్చుకొనేందుకు పంపమని బలవంత పెట్టేవారు. లొంగకపోతే దారుణంగా కొట్టేవారు. ఎంతోమంది స్త్రీలను వారు మానభంగం చేశారు. ఈ విషయాన్ని కూడా మీ దృష్టికి తీసుకొని వచ్చాను. మీరు దాని మీద విచారణకు ఆదేశించి ఒక నివేదకను విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. కాని ఏ విచారణ జరగలేదు. ఏ నివేదిక బయటకు రాలేదు.

రాజషాహి జిల్లాలో ఒక గ్రామంలో ఒక సంఘటన జరిగింది. కమ్యూనిస్టులు అన్న నెపంతో పోలీసులు, స్థానిక ముస్లింలు హిందువుల ఆస్తిపాస్తులను దోచుకున్నారు. సంతాల్‌లు సరిహద్దుదాటి పశ్చిమ బెంగాల్‌కు వచ్చి జరుగుతున్న దారుణాలు గురించి ప్రపంచానికి తెలియచేసారు.

**అనాథలైన హిందువులు:**

ఖుల్నా జిల్లాలో 1949 డిసెంబరు 20న ఒక దారుణ సంఘటన జరిగింది. కమ్యూనిస్టులను వెతికే నెపంతో పోలీసు బృందం ఒక ఇంటిపై దాడిచేసింది. సమాచారం ముందుగా పొక్కటంతో ఇంటి యజమానితో ఉన్న కొందరు యువకులు ఇంట్లో ఉండకుండా దూరంగా వెళ్ళారు. పోలీసులు ఇంటిపై దాడి చేసి గృహస్థు భార్యను నిర్భంధించారు. ఆమె ఏడుపు విని ఇంటి యజమాని, మిగిలిన యువకులు తిరిగి వచ్చి పోలీసులపై దాడి చేశారు. వారు కొట్టిన దెబ్బలకు ఒక పోలీసు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మిగిలిన ఇద్దరు పోలీసులు బయటకు పరుగెత్తి పొరుగున ఉన్న ముస్లింల సహాయం అడిగారు. చనిపోయిన కానిస్టేబుల్‌ను తీసుకొని పోలీసులు వెళ్లిపోయారు. ఖుల్నా జిల్లా పోలీసు అధికారి ఆ మర్నాడు మధ్యాహ్నానికి పెద్ద బలగంతో ఆ ఊరికి వచ్చాడు. దాడి చేసిన యువకులు, వారి ఇరుగుపొరుగు వారు ఊరు విడిచి వెళ్ళారు. అయితే మిగిలిన జనాభా వారి ఇళ్ళలో ఉన్నారు. ఏమి జరుగుతుందో తెలుసుకొనే లోపల ముస్లింలు పోలీసుల సహాయంతో ఇళ్ళల్లో చొరబడి దోచుకున్నారు. దేవీ దేవతా విగ్రహాలను ధ్వంసం చేశారు. అనేక మందిని చంపారు. బలవంతంగా కొందరిని ముస్లింలుగా మార్చారు. మహిళలను మానభంగం చేశారు. నామ శూద్రులు ఆధిక్యంగా నివసించే ఆ గ్రామంలోనే కాక, ఆ చుట్టు పక్కల గ్రామాల్లో సైతం క్షణాల్లో నరకం సృష్టించారు.

ఫిబ్రవరి 28, 1950న నేను ఆ గ్రామాలను సందర్శించాను. జిల్లా అధికారులు, ముస్లింలీగ్ నాయకులు నాతో ఉన్నారు. ఒక గ్రామంలో 350 ఇళ్ళకు గాను మూడు ఇళ్ళే మిగిలాయి. మిగిలిన ఇళ్ళను, వారి నాటు పడవలను ధ్వంసం

చేశారు. నామ శూద్రుల పశువులను తోలుకెళ్ళారు. ముఖ్యమంత్రికి, ప్రధాన కార్యదర్శికి ప్రధాన మంత్రికి ఈ వివరాలు అన్నీ చెప్పాను.

ఈ గ్రామాలలో జరిగిన దారుణాలు గురించిన వార్తలు పశ్చిమ బెంగాల్ పత్రికలలో రావటంతో హిందువులు అశాంతికి, ఆగ్రహానికి గురిఅయ్యారు. ఆ గ్రామాలకు చెందిన బాధితులు అనేక మంది అనాథలయ్యారు. వారిలో కొందరు కలకత్తా వచ్చి వారి గోడును వెళ్ళబుచ్చారు. వారి బాధ మిగిలిన వారిని కదిలించటంతో పశ్చిమ బెంగాల్‌లో మత సంఘర్షణలు జనవరి చివరిలో చెలరేగాయి.

**హిందువులపై ప్రతీకార దాడులు:**

1950 ఫిబ్రవరిలో ఢాకాలోనూ, తూర్పు బెంగాల్‌లో ఇతర ప్రాంతాలలోనూ మత సంఘర్షణలు పెద్ద పెట్టున చెలరేగాయి. ఫిబ్రవరి రెండవ వారంలో కాంగ్రెసు సభ్యులు రెండు సావధాన తీర్మానాలను ప్రవేశపెట్టేందుకు అనుమతి కోరారు. కాని అనుమతిని ఇవ్వలేదు. దానితో వారు నిరసనగా శాసనసభ నుండి బయటకు వెళ్ళారు. హిందూ ప్రతినిధుల ఈ చర్య ముస్లిం నేతలతో పాటుగా ముస్లిం ప్రజలకు కూడా ఆగ్రహం తెప్పించింది. ఢాకాలో జరిగిన మతఘర్షణలకు ఇదే కారణం.

1950 ఫిబ్రవరి 10న ఉదయం 10 గంటల సమయంలో ఒక స్త్రీకి ఎర్రరంగు పులిమి ప్రదర్శించారు. ఆమె వక్షోజాలను కలకత్తా మత సంఘర్షణలో తెగగొట్టారని చెప్తూ తూర్పు బెంగాల్ సెక్రటేరియట్ చుట్టూ తిప్పారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ బయటకు వచ్చి హిందువులపై ప్రతీకారం తీర్చుకోవాలని నినాదాలను చేశారు. ఊరేగింపును లేవదీశారు. ఒక మైలు దూరం నడవగానే జనంతో ఊరేగింపు నిండిపోయింది. విక్టోరియా పార్కులో 12 గంటలకు హిందువులకు వ్యతిరేకంగా ఉద్రిక్తతలు రెచ్చగొడ్తూ ఉపన్యాసాలు చేశారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఆ సమయంలో అదే భవనంలో ఉభయ బెంగాల్‌లలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యలు గురించి చర్చిస్తున్నారు.

**దోపిడీదారులకు వత్తాసుగా అధికారులు:**

మధ్యాహ్నం ఒంటి గంటకు ఢాకా రాజధాని అంతటా ఘర్షణలు మొదలయ్యాయి. హిందువులపై విచక్షణా రహితంగా దాడి చేశారు. వారి షాపులను లూటీ చేశారు. ఇళ్ళను తగుల బెట్టారు. అడ్డుకున్న వాళ్ళని చంపారు. మహిళలను మానభంగం చేశారు. రాజధానిలో అన్ని ప్రాంతాలలోను లూటీలు, హత్యలు మానభంగాలు పతాక స్థాయిలో జరిగాయి. అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితం అయ్యారు. హిందువులపై దాడిని నివారించటానికి బదులుగా, వారికి వత్తాసు పలికారు. అంతేకాకుండా మార్గదర్శకం కూడా చేశారు. దురదృష్టవశాత్తు నేను ఢాకాకు సాయంత్రం 5 గంటలకు చేరుకోగలిగాను. జరిగిన విధ్వంసాన్ని ప్రత్యక్షంగా చూశాను. నేను చూసింది, విన్నది హృదయ విదారకంగాను, భయభ్రాంతులకు గురిచేసేదిగాను ఉంది.

**ఢాకా అల్లర్లకు ప్రధాన కారణాలు:-**

1. తూర్పు బెంగాల్ అసెంబ్లీలో హిందూ ప్రతినిధులు మతఘర్షణలపై సావధాన తీర్మానాన్ని ప్రవేశపెట్టటానికి ప్రయత్నించటాన్ని ముస్లిం లీగ్ జీర్ణించుకోలేకపోయింది. అందుకు అనుమతి నిరాకరించటంతో వారు సభ నుండి బయటకు వెళ్ళటాన్ని కూడా ముస్లిం లీగ్ జీర్ణించుకోలేకపోయింది. హిందూ ప్రతినిధుల ప్రజాస్వామిక హక్కు వారి ఆధిపత్యానికి ధిక్కారంగా వారు భావించారు.

2. ముస్లిం లీగ్ సభ్యులలో సుహ్రావర్ధీ వర్గానికి, నిజముద్దీన్ వర్గానికి మధ్య ఉన్న విభేదాలతో అధికారంలో ఉన్న వర్గాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రత్యర్థి వర్గం హిందువులపై దాడులకు రెచ్చగొట్టారు.

3. బెంగాల్ ఏకీకరణకు కొందరు హిందువులు, ముస్లింలు పూనుకొంటున్నారన్న వార్తలు ముస్లిం లీగ్‌ను

అభద్రతాభావానికి గురిచేశాయి. దాన్ని మొగ్గలోనే ప్రతిఘటించాలని అనుకొన్నారు. తూర్పు బెంగాల్‌లో హిందువులపై దాడులు, పశ్చిమ బెంగాల్‌లో ముస్లింలపై దాడులకు దారి తీస్తుంది కనుక హిందూ, ముస్లింల మధ్య ఐకమత్యానికి భంగం వాటిల్లి ఉమ్మడి బెంగాల్ ఉద్యమానికి మద్దతును దెబ్బతీయవచ్చని ముస్లింలీగ్ భావించింది.

4. బెంగాల్ ముస్లింలకు, బెంగాల్ యేతర ముస్లింలకు విబేధాలు పెరుగుతున్నాయి. దీన్ని నిరోధించి ముస్లింలు అందర్నీ ఒక తాటి మీదకు తీసుకొని రావాలంటే హిందువులు, ముస్లింలు మధ్య చిచ్చు పెట్టాలి. భాషా సమస్య కూడా దీనితో ముడిపడి ఉంది.

5. భారత్-పాక్ వాణిజ్య సంబంధాలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో దాని ప్రభావం ముందు పట్టణ ప్రాంతాలలో, తర్వాత గ్రామీణ ప్రాంతాలలో పడింది. ముస్లిం ప్రజలను ఈ సమస్య నుండి దృష్టి మళ్ళించటానికి హిందువులపై జీహాద్‌ను ప్రకటించారు.

**కళ్ళు తిరిగే వాస్తవాలు - 10 వేల మంది మృతి:**

ఢాకాలో నేను 9 రోజులు ఉన్నాను. ఘర్షణలు చెలరేగిన అన్ని ప్రాంతాలు పర్యటించాను. ఢాకాను, దాని పరిసర ప్రాంతాలకు వెళ్ళాను. మీరాపూర్ వెళ్ళాను. అమాయకులైన వందలాది హిందువులను రైళ్ళలో పట్టుకొని చంపివేశారు. ఢాకా, నారాయణ్ గంజ్, ఢాకా - చిట్టగాంగ్‌ల మధ్య  నడుస్తున్న రైళ్ళలో ఈ దారుణాలు చేశారు. మత సంఘర్షణలు చెలరేగిన రెండవ రోజున తూర్పు బెంగాల్ ముఖ్యమంత్రిని కలసి ఘర్షణలను అదుపుచెయ్యమని, ఇతర ప్రాంతాలకు పాకకుండా అధికారులకు ఆదేశాలు ఇవ్వమని కోరాను. ఫిబ్రవరి 20, 1950న బరిసాత్ పట్టణానికి వెళ్ళాను. అక్కడి పరిస్థితులు నా గుండెను పిండి చేశాయి. కాశీపూర్, లకూటియా, మధబ్ పాషాలు జిల్లా కేంద్రానికి 6 మైళ్ళ పరిధిలో ఉన్నాయి. ఆ ప్రాంతాలు చేరటానికి మోటారు వాహనాలు వెళ్ళగలిగే రహదారులు కూడా ఉన్నాయి. ఒక్క మధబ్‌పాషా జమిందారు ఇంట్లోనే 300 మందిని పైగా చంపారు. 40 మందిని గాయపరిచారు. ములాది అనే చోట భయంకరమైన నరకాన్ని సృష్టించారు. ములాదీ బందర్‌లో ఒక్కచోటనే మూడు వందల మందిని పైగా చంపారు. ములాది గ్రామంలో శవాల గుట్టలు కన్పించాయి. కుక్కలు, ఇతర జంతువులు శవాలను నదీ తీరం దగ్గర పీక్కొని తింటున్నాయి. మగవాళ్ళందర్నీ చంపిన తర్వాత, ఆడపిల్లలను ముస్లిం రజాకార్లు వాళ్ళలో వాళ్ళు పంచుకొన్నారు. పోలీసు ఠాణాకు రాయివేటు దూరంలో ఉన్న హిందువుల ఇళ్ళను సైతం యధేచ్ఛగా లూటీ చేశారు. ఇళ్ళను తగుల బెట్టారు. హిందువులను గుర్తించి, పట్టుకొని చంపారు. ఒక బరిసాల్ జిల్లాలోనే 2500 మందిని పైగా చంపివేశారు. ఢాకా,దాని పరిసర ప్రాంతాలతో కలిపి పదివేల మందికి పైగా నిర్దాక్షిణ్యంగా చంపారు. నేను విచారంతో శోకించాను. తమ సర్వస్వం పోగొట్టుకొన్న స్త్రీలను, పిల్లలను చూసి నేను కృంగిపోయాను. నన్ను నేను ప్రశ్నించుకొన్నాను. "ఇస్లామ్ పేరుతో పాకిస్థాన్‌కు ఏమి రానున్నది?"

**ఢిల్లీ ఒప్పందాన్ని అమలు చెయ్యాలన్న చిత్తశుద్ధి లేదు:**

మార్చిలో పెద్ద పెట్టున హిందువులు తూర్పు బెంగాల్ వదలి పశ్చిమ బెంగాల్‌కు వలస వెళ్ళటం మొదలు పెట్టారు. కొద్ది కాలంలోనే హిందువులందరూ తూర్పు బెంగాల్‌ను ఖాళీ చేసేటట్లుగా కనపడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఒక జాతీయ విపత్తు ఏర్పడనుంది. అయితే ఏప్రిల్ 8న ఢిల్లీలో  భారత్ -పాక్‌ల మధ్య ఒక  ఒప్పందం కుదిరింది. దానినే ఢిల్లీ ఒప్పందం అంటారు.

తూర్పు బెంగాల్ అంతా విస్తృతంగా పర్యటించి, వలస పోగా మిగిలిన హిందువులకు ధైర్యం చెప్పే పనిచేశాను. తమ స్వంత ఊళ్ళు, ఇళ్ళు వదలి వలస వెళ్ళవద్దని హితవు చెప్పాను. ముస్లింలీగ్, తూర్పు బెంగాల్ ప్రభుత్వం ఢిల్లీ ఒప్పందాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తారని ఆశించాను. కాని తూర్పు బెంగాల్ ప్రభుత్వానికి ఒప్పందాన్ని అమలు చేసే ఉద్దేశమే లేదు. అందుకోసం ఎట్టి యంత్రాంగాన్ని అది ఏర్పాటు చేయలేదు. తమ తమ గ్రామాలకు తిరిగి వచ్చిన

హిందువులకు వారి స్వంత ఇళ్ళను వారికి ఇవ్వలేదు. తరతరాల నుండి అనుభవిస్తున్న వారి స్వంత భూములను వారికి ఇవ్వలేదు.ఇళ్ళను, భూములను ముస్లింలు ఏనాడో కబ్జా చేశారు.

**మౌలానా అక్రమ్ ఖాన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు:**

ముస్లింలీగ్ నాయకుల ఉద్దేశ్యాలకు సంబంధించి నా అనుమానాలు నిజమయ్యాయి. పాకిస్థాన్ అల్ప సంఖ్యాక శాఖా మంత్రి తన రేడియో ప్రసంగంలో -" ప్రవక్త మహమ్మద్ సైతం యూదులకు అరేబియాలో స్వేచ్ఛను ఇచ్చారు అని చెప్పాడు." ప్రాంత ముస్లిం లీగ్ అధ్యక్షుడైన అక్రమ్ ఖాన్ తన పత్రిక 'మొహమ్మదీ' వైశాఖి సంచికలో సంపాదకీయంలో ఈ విధంగా వ్రాశాడు. "డా॥ మాలిక్ (అల్ప సంఖ్యాక శాఖా మంత్రి) తన ప్రసంగంలో అరేబియాలో యూదుల గురించి ప్రస్తావించకపోయి ఉంటే బాగుండేది. మహమ్మద్ యూదులకు స్వేచ్ఛను ఇచ్చిన మాట నిజమే. కాని చరిత్రలో అది మొదటి అధ్యాయం. కాని చివరి అధ్యాయంలో మహమ్మద్ ఇచ్చిన ఆదేశం భిన్నంగా ఉంది. ఆయన యూదులను అరేబియా నుండి బహిష్కరించమని ఆదేశాలు ఇచ్చాడు."

ఆ సంపాదకీయం చదివిన తర్వాత కూడా నురుల్ అమీన్ ప్రభుత్వం చిత్తశుద్ధితోనే పనిచేస్తుందని నేను ఆశించాను. కాని నా నమ్మకం వమ్ము అయింది. నురుల్ అమీన్ డి.ఎన్. బరారిని మైనారిటీలకు ప్రతినిధిగా మంత్రివర్గంలోకి తీసుకున్నాడు.

**నురుల్ అమీన్ ప్రభుత్వ కపటం:**

నేను ఒక పత్రికా ప్రకటన చేశాను. డి.ఎన్.బరారిని మంత్రివర్గంలోకి తీసుకోవటం ద్వారా తూర్పు బెంగాల్ మైనారిటీలకు ఎలాంటి ఊరట కలుగదని, అంతేకాక ఆయన చేరికతో నురుల్ అమీన్ ప్రభుత్వం మీద ఉన్న అన్ని భ్రమలు తొలగి పోయాయని ప్రకటించాను. ఎందుకంటే నురుల్ అమీన్ ప్రభుత్వానికి ఢిల్లీ ఒప్పందాన్ని అమలు చేయాలన్న ఉద్దేశం లేదు. డి.ఎన్. బరారి ఎవరికి ప్రతినిధి కాడు. ఆయనకు ఆయనే ప్రతినిధి. ధనబలంతో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ మీద గెలిచి తూర్పు బెంగాల్ శాసన సభ సభ్యుడయ్యాడు. షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్‌ను మొదటి నుండి వ్యతిరేకించాడు. కొన్నాళ్ళ తర్వాత కాంగ్రెస్‌ను వీడి, ఫెడరేషన్‌లో చేరాడు. మంత్రిగా నియమించబడ్డాడు. కనుక ఫెడరేషన్ సభ్యత్వాన్ని కోల్పోయాడు. తూర్పు బెంగాల్ హిందువులు నాతో ఏకీభవిస్తారని ఆశిస్తున్నాను. పూర్వాపరాలు, వ్యక్తిత్వం, మేథోపటిమలను పట్టి చూస్తే బరారి హిందువుల ప్రతినిధిగా ఢిల్లీ ఒప్పందంలో భాగంగా మంత్రి అయ్యేందుకు అర్హత లేనివాడు.

నేను ఇద్దరి పేర్లను నురుల్ అమీన్‌కు సూచించాను. వారు ముగ్గురు వారి వారి రంగాలలో నిష్ణాతులు. ఒకరు ఢాకా హైకోర్టులో ప్రముఖ న్యాయవాది. షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్‌కు ఉపాధ్యక్షులు. నాలుగు సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా వారికి ఉంది. రెండవ వారు శాసన మండలిలో 7 సంవత్సరాల పాటు సభ్యులుగా ఉన్న అనుభవం ఉన్నవారు. వారు కూడా న్యాయవాదే. ఆ ఇద్దరు పెద్ద మనుషులను కాదని మూడవ వ్యక్తిని ఎందుకు మంత్రిగా నియమించారో తెలియదు. నేను ఖచ్చితంగా చెప్పగలను. బరారిని మైనారిటీ మంత్రిగా నియమించటం ఢిల్లీ ఒప్పందం స్ఫూర్తికే విరుద్ధం. హిందూ అల్ప సంఖ్యాకులలో అభద్రతా భావాన్ని పోగొట్టి, వారు తూర్పు బెంగాల్‌లో నివాసం కొనసాగించటానికి, వారి ఆస్తిపాస్తులకు, మానప్రాణాలకు, మతానికి భద్రత కల్పించటమే ఢిల్లీ ఒప్పందం లక్ష్యం.

**హిందువులను తరిమికొట్టటమే ప్రభుత్వ విధానం:**

నేను ఇప్పుడు గట్టిగా నమ్ముతున్నాను. హిందువులను తరిమి కొట్టాలనే ఉద్దేశ్యంతోనే తూర్పు బెంగాల్ ప్రభుత్వం పనిచేస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. మీతో మాట్లాడుతూ ఒకటి రెండు సార్లు ఈ విషయాన్ని ప్రస్తావించాను కూడా. పశ్చిమ పాకిస్థాన్ నుండి హిందువులను బలవంతంగా వెళ్ళగొట్టారు. ఇప్పుడు తూర్పు పాకిస్థాన్ నుండి కూడా హిందువులను వెళ్ళగొడుతున్నారు. హిందువులను తరిమి కొట్టటమనే ప్రక్రియలో చివరి అంకం ఇప్పుడు నడుస్తున్నది. పాకిస్థాన్ తన

హిందూ మైనారిటీలకు భద్రత కల్గించటంలో విఫలం అయింది. ఇస్లామిక్ రాజ్య స్థాపన దిశగా పాకిస్థాన్ పరుగులు తీస్తున్నది. హిందూ మేథావులను వారు వదిలించుకోదల్చుకున్నారు. ఎందుకంటే వారి వలన పాక్ రాజకీయ, ఆర్థిక, సామాజిక జీవనాలు ప్రభావితం కాకూడదని వారు అనుకొంటున్నారు.

**ఉమ్మడి నియోజక వర్గాలుఏర్పాటుకు వ్యతిరేకత:**

నియోజక వర్గాలకు సంబంధించిన అంశాలను ఎందుకు ఇంతవరకు నిర్ణయించలేదో నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. అల్ప సంఖ్యాక వర్గ సబ్ కమిటీ మూడు సార్లు భేటీ అయింది. ఉమ్మడి నియోజకవర్గాలు ఉండాలా, ప్రత్యేక నియోజకవర్గాలు ఉండాలా అన్న ప్రశ్నను పరిష్కరించలేదు. పాకిస్థాన్‌లో గుర్తించబడ్డ మైనారిటీల ప్రతినిధులు ఉమ్మడి నియోజక వర్గాల వైపు మొగ్గు చూపారు. వెనకబడ్డ అల్ప సంఖ్యాకులకు కొన్ని నియోజక వర్గాలను కేటాయించాలని వారు కోరుకున్నారు. ఆగష్టులో జరిగిన సమావేశంలోనూ ఈ విషయమై చర్చకు వచ్చింది. కాని ఎట్టి చర్చ జరగకుండానే సమావేశం నిరవధిక వాయిదా పడ్డది. పాక్ పాలకులు ఇలాంటి ముఖ్యమైన అంశంపై నిర్ణయం తీసుకోవటంలో జాప్యం చేయటం ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నారో అర్థం చేసుకోవటం కష్టం ఏమీ కాదు.

**హిందువుల భవిష్యత్తు అగమ్యగోచరం:**

హిందువుల భవిష్యత్తు తూర్పు బెంగాల్‌లో అగమ్య గోచరంగా కల్పిస్తుంది. ఢిల్లీ ఒప్పందం వలన ఎలాంటి ప్రయోజనము కలుగలేదు. హిందువులు ఏ మాత్రం ఆశాజనకంగా లేరు. సమీప భవిష్యత్తు అంధకారమయం. తూర్పు బెంగాల్ హిందువులలో ఆత్మ విశ్వాసం పునరుద్ధరించబడలేదు. తూర్పు బెంగాల్ ప్రభుత్వం, ముస్లింలీగ్ ఢిల్లీ ఒప్పందాన్ని చెత్త కాగితంగా చూస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌కు వలస వెళ్ళిన అనేక మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులు తూర్పు బెంగాల్‌కు తిరిగి రావటానికి కారణం వారికి తూర్పు బెంగాల్ ప్రభుత్వం పై నమ్మకం కుదిరి కాదు. కాందిశీకుల శిబిరాలలో ఎన్నాళ్ళో తలదాచుకోలేక కొందరు, వారికున్న కొద్దిపాటి ఆస్తిపాస్తులను తెగనమ్ముకొని తిరిగి హిందుస్థాన్ వెళ్ళేందుకు మరికొందరు తిరిగి వస్తున్నారు. తూర్పు బెంగాల్‌లో తీవ్రమైన మత ఘర్షణలు ఈ మధ్య కాలంలో జరగక పోవటానికి కారణం ఢిల్లీ ఒప్పందం అమలు కారణం కాదు. ఒప్పందం ఉన్నా లేకపోయినా ఘర్షణలు ఎల్లకాలం కొనసాగవు.

ఒప్పందం చేసుకోవటమే లక్ష్యం కాదు. ఇండియా, పాకిస్థాన్ మధ్య ఏర్పడుతున్న వివాదాలను, బేధాభిప్రాయాలను పరిష్కరించుకొనేందుకు అనువైన పరిస్థితులను సృష్టించటమే అసలు ఒప్పందం లక్ష్యం. కాని ఒప్పందం అమలు అయిన ఈ ఆరునెలల్లో ఏ ఒక్క వివాదం పరిష్కారం కాలేదు. ఏ బేధాభిప్రాయం పరిష్కరించబడలేదు. అంతేకాక మత దురహంకారంతో హిందూ వ్యతిరేక,భారత్ వ్యతిరేక ప్రచారాన్ని పాకిస్థాన్ ఇంటా బయటా పెద్దపెట్టున కొనసాగిస్తున్నది. కాశ్మీర్ దినాన్ని పాకిస్థాన్ అంతటా ఎంతో ఆర్భాటంగా నిర్వహించటం పాకిస్థాన్ భారత వ్యతిరేక ప్రచారానికి నిదర్శనం. పంజాబు గవర్నరు ఇటీవల మాట్లాడుతూ భారత్‌లో ముస్లింల రక్షణ కోసం పాకిస్థాన్‌కు పెద్ద సైనిక శక్తిగా అవతరించటం అవసరమన్న సందేశం పాకిస్థాన్ అసలు ఉద్దేశ్యాలను బయటపెడుతుంది. రెండు దేశాల మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణాన్ని అది మరింత ఎక్కువ చేస్తుంది.

**తూర్పు బెంగాల్‌లో ప్రస్తుతం ఏం జరుగుతున్నది?**

తూర్పు బెంగాల్‌లో ప్రస్తుత పరిస్థితి ఏమిటి? దేశ విభజన తర్వాత 50 లక్షల మంది హిందువులు తూర్పు బెంగాల్‌ను విడిచి వెళ్ళారు. మొన్నజరిగిన మత ఘర్షణల వల్ల మాత్రమే కాదు. ఇంకా ఇతర కారణాల వల్ల కూడా హిందువులు దేశం విడిచి వెళుతున్నారు. హిందూ లాయర్లను, వైద్యులను, వ్యాపారస్థులను, వర్తకులను ముస్లింలు ఒక పద్ధతి ప్రకారం బాయ్‌కాట్ చేస్తున్నారు. దానితో జీవనోపాధి మృగ్యమై మనుగడ కోసం దేశం విడిచి వెళ్తున్నారు. హిందువుల ఇళ్ళను ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండానే స్వాధీనం చేసుకోవటంతో వారు దిక్కులేని వారు అవుతున్నారు. హిందువుల

ఇళ్ళలో అద్దెకు ఉన్న ముస్లింలు అద్దెలు చెల్లించటం లేదు. హిందూ భూస్వాములకు కౌలు చెల్లించటం ఆగిపోయి చాలా రోజులు అయింది. రజాకార్ల మీద అనేక ఫిర్యాదులు వచ్చాయి. హిందువుల భద్రతకు, రక్షణకు వారు పెద్ద ముప్పుగా మారారు. విద్యా విషయాలలో జోక్యం, ఇస్లామీకరణకు చేసే ప్రయత్నాల వల్ల విద్యా సంస్థలు బెదిరిపోతున్నాయి. వారందరూ తూర్పు బెంగాల్ వదలి వెళుతున్నారు. సెకండరీ పాఠశాలలకు ఒక ఉత్తర్వుఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పని సరిగా ఖురాన్ పఠించాలని ఉత్తర్వులిచ్చారు. పాఠశాల భవనాలకు జిన్నా, ఇక్బాల్, నియాకత్ అలీ, నిజాముద్దీన్ మొదలైన ముస్లిం ప్రముఖుల పేర్లు మాత్రమే పెట్టాలని తాఖీదు ఇచ్చారు. 1500 ఉన్నత పాఠశాలలో కేవలం 560 మాత్రమే పనిచేస్తున్నాయి. వైద్యుల వలసకారణంగా రోగులకు సరైన వైద్యసహాయం అందటం లేదు. హిందూ పురోహితులందరూ దేశం విడిచి ఎప్పుడో వెళ్ళిపోవడంతో ముఖ్యమైన హిందూ ఆరాధనీయ కేంద్రాలు అన్నీ మూత బడ్డాయి. పెండ్లిళ్ళు, పబ్బాలు జరిపించేందుకు పురోహితులు లేరు. దేవీ దేవతా విగ్రహాలు తయారు చేసే కళాకారులు లేదు. హిందూ మెజారిటీ ఉన్న గ్రామాలలోనూ ముస్లింలే బలవంతంగా గ్రామ పంచాయితీలకు అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. హిందూ ప్రధాన ఉపాధ్యాయులు, కార్యదర్శుల స్థానే ముస్లింలే కూడబలుక్కుని బలవంతంగా పదవులను లాక్కొన్నారు. కొందరు హిందూ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉంది. వారి దగ్గర పనిచేసే కింద స్థాయి ముస్లిం ఉద్యోగులు పదోన్నతి పొంది వారికే అధికారులయ్యారు. కొందరు హిందూ ఉద్యోగులను ఉద్యోగాల నుండి బలమైన కారణం లేకుండానే తొలగించారు. చిట్టగ్యాంగ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఏ కారణం లేకుండానే ఆ పదవి నుండి ఇటీవల తొలగించారు.

**హిందువుల సాంఘిక బహిష్కరణ:**

హిందువుల ఇళ్ళను దోచుకోవటం, వారిని యదేచ్ఛగా వేధించటం, హింసించటం ఎప్పటిలాగానే కొనసాగుతున్నది. పోలీసు స్టేషనులలో హిందువులు ఇచ్చిన ఫిర్యాదులను పట్టించుకోరు. హిందూ కన్యలను అపహరించటం, మానభంగం చెయ్యటం తగ్గిపోయింది. ఎందుకంటే 12-30 సంవత్సరాల మధ్య వయసుగల హిందూ సవర్ణ కన్యలు ఎవరూ ఇప్పుడు తూర్పు బెంగాల్‌లో లేరు. వెనుకబడ్డ కులాలకు చెందిన హిందూ కన్యలు వారి తల్లి దండ్రులతో ఉంటున్నా, వారిని ముస్లిం గూండాలు వదలటం లేదు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఆడపిల్లలపై మానభంగాలకు కొదువ లేదు. ముస్లిం గూండాలు తమ ఆడపిల్లలను వేధిస్తున్నారన్న అనేక ఫిర్యాదులు నాకు అందాయి.

ముస్లిం కొనుగోలుదారులు హిందూరైతుల దగ్గర నుండి ఏ ఉత్పత్తులు కొన్నా వాటి విలువలో కొంత భాగాన్నే చెల్లిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించేందుకు లేదు. పాకిస్థాన్‌లో న్యాయం, ధర్మం అనే దానికి అర్థాలు వేరు. ముస్లింలకు ఒక న్యాయం. హిందువులకు మరొక న్యాయం. హిందువులు ఎప్పుడూ రెండవ తరగతి పౌరులే.

**పశ్చిమ పాకిస్థాన్‌లో బలవంతపు మత మార్పిళ్ళు:**

పశ్చిమ పాకిస్థాన్‌లో సైతం పరిస్థితులు మెరుగ్గా లేవు. సింధు రాష్ట్రంలో ఒక లక్షమంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు ఉన్నారు. దేశ విభజన తర్వాత పశ్చిమ పంజాబులో వేలాదిగా ఉన్న షెడ్యూల్డ్ కులాల వారిని బలవంతంగా ఇస్లాంలోకి మార్చారు. ముస్లిం గూండాలు అపహరించిన ప్రతి 12 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన బాలికలలో నలుగురిని మాత్రమే తిరిగి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. మిగిలిన వారి అతీగతీ తెలియదు. వారి పేర్లు, వారిని అపహరించిన వారి వివరాలు కూడా అధికారులకు ఇవ్వటం జరిగింది. తల్లిదండ్రులు పోలీసు స్టేషన్లు చుట్టూ ఎన్ని సార్లు ప్రదిక్షణలు చేసినా ఫలితం లేదు. అపహరించిన ఆడపిల్లలను పట్టుకొనేందుకు నియమించబడ్డ అధికారి ఒక చిత్రమైన జవాబు ఇచ్చాడు. అపహరించబడ్డ హిందూ కన్యల, స్త్రీల జాడ తెలుసుకోవటం తన బాధ్యత అని,షెడ్యూల్డ్ కులాలకు చెందిన మహిళలు హిందువులు కాదు కాబట్టి వారి జాడ తెలుసుకోవలసిన బాధ్యత తనది కాదని పేర్కొన్నాడు. కరాచీలో నివసిస్తున్న

హిందువుల జీవితాలు దయనీయంగా ఉన్నాయి. కరాచీ, సింధ్‌లలో 363 దేవాలయాలు, గురుద్వారాలు ముస్లింల ఆధీనంలోనే ఇంకా ఉన్నాయి. కొన్ని దేవాలయాలను మాంసం కొట్లుగా, మరికొన్నింటిని జంతు వధశాలలుగా మార్చారు. ఏ ఒక్క దేవాలయాన్ని, గురుద్వారాన్ని వారు తిరిగి హిందూ, సిక్కు స్వంతదారులకు ఇవ్వలేదు.

హిందువుల భూములను స్వాధీనం చేసుకొన్నారు. ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదు. ముందస్తుగా ఎటువంటి నోటీసు కూడా ఇవ్వలేదు. ముస్లిం కాందిశీకులుకు, స్థానిక ముస్లింలకు ఆ భూములను ఇచ్చారు. మూడు వందల మంది హిందువులు స్థానికులే అని పేర్కొన్నా, వారికి చెందవలసిన వారి ఆస్తి పాస్తులను, ఇళ్ళను, భూములను వారికి ఇవ్వలేదు. ప్రసిద్ధి చెందిన కరాచీ గోశాలను సైతం దాని ధర్మకర్తలకు స్వాధీనం చెయ్యలేదు. అపహరించబడ్డ తమ కూతుళ్ళు, భార్యల గురించి అనేక మంది దురదృష్టవంతులైన తల్లిదండ్రుల, భర్తల నుండి నాకు అనేక ఫిర్యాదులు కరాచీ నుండి వచ్చాయి. వారిలో అనేకులు షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు. ప్రభుత్వం దృష్టికి వారి దుస్థితిని తీసుకొనివెళ్ళాను. కాని ప్రభుత్వం వారి ఫిర్యాదులను పట్టించుకోలేదు. సింధు రాష్ట్రంలో నివసిస్తున్న అనేక మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారిని బలవంతంగా ఇస్లాంలోకి మార్చారు. ఇది నాకు ఎంతో విచారాన్ని కలుగ చేసింది.

**పాకిస్థాన్ హిందువుల పాలిట శాపం:**

నా ఉద్దేశ్యం ప్రకారం పాకిస్థాన్ హిందువులు ''స్టేట్ లెస్'' అయ్యారు. వారి స్వంత దేశంలో, స్వంత ఇళ్ళలో ఉ నన్నప్పటికి వారిని పౌరసత్వం లేనివాళ్ళుగా మార్చారు. వారి తప్పు హిందువులుగా బ్రతకటమే. ముస్లింలీగ్ నాయకులు పాకిస్థాన్ ఇస్లామిక్ మత రాజ్యమని, ఇస్లామిక్ మత రాజ్యంగానే ఉంటుందని పదే పదే ప్రకటిస్తున్నారు. అన్ని సమస్యలకు పరిష్కారంగా ఇస్లామ్‌ను చూపిస్తున్నారు. పెట్టుబడి దారి, సామ్యవాద వ్యవస్థలకు ప్రత్యామ్నాయంగా ఇస్లామిక్ వ్యవస్థను తీసుకొని వస్తున్నారు. 'ఇస్లామిక్ సమానత్వం', 'సౌభ్రాతృత్వం' ప్రత్యామ్నాయంగా అనుసరించే మార్గాలుగా చెప్తున్నారు.

షరియత్‌ను అనుసరించి పాలన చేసే ఆ ఇస్లామిక్ వ్యవస్థలో ముస్లింలు ఎప్పుడూ పరిపాలకులుగా ఉంటారు. హిందువులు, ఇతర అల్ప సంఖ్యాక వర్గాల వారు జిమ్మీలు, పాలితులు. వారిక భద్రత కావాలనుకుంటే అందుకు మూల్యం చెల్లించవలసిందే. ఆ మూల్యం ఏమిటో ప్రధానమంత్రిగా మీకు బాగా తెలుసు.

ఎన్నో చూసిన దాని మీదట, విన్న దాని మీదట, చదివిన దాని మీదట, ఎంతో ఆందోళనకు, ఘర్షణకు లోనయిన పిమ్మట ఒక స్థిరమైన అభిప్రాయానికి నేను వచ్చాను. పాకిస్థాన్ హిందువులకు అనువైన నెలవు కాదు. హిందువులకు పాకిస్థాన్‌లో స్థానం లేదు. ఇక్కడ ఉన్న హిందువులను బలవంతంగా మతం మార్చుతారు. అందుకు వారు ప్రతిఘటిస్తే వారిని నిర్దాక్షిణ్యంగా ఈ లోకంలోనే లేకుండా చేస్తారు. దశల వారిగా ఇక్కడ సమీప భవిష్యత్తులో జరగబోయేది ఇదే. సవర్ణ హిందువులలో అధిక సంఖ్యాకులు తమ స్వంత గడ్డను ఇళ్ళను, ఆస్తిపాస్తులను వదిలి వేసి, కాందిశీకులుగా హిందూస్థాన్ పారిపోయారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారిలో ఏ మాత్రం రాజకీయ చైతన్యం ఉన్న వాళ్ళు కూడా అదే పని చేశారు. మిగిలిన హిందువుల గతి పాకిస్థాన్‌లో అధోగతే.

మీ లాంటి విద్యావంతుడు, అనుభవజ్ఞుడు ప్రధానమంత్రిగా ఏలుతునన్న కాలంలోనే ఇంతటి అరాచక పరిస్థితులు నెలకొన్నాయి. మానవాళికి ముప్పు కలిగించే ఒక సిద్ధాంతాన్ని, అన్ని రకాల సమానత్వ సూత్రాలను బేఖాతరు చేస్తూ ఒక ప్రమాదకర సిద్ధాంతాన్ని మీరు ప్రవచించటం, అమలు చేయటం అమానుషం. దురన్యాయం. మీకు, మీతోటి కార్యకర్తలు చెప్తున్నాను. హిందువులు వారి మాతృభూమిలోనే జిమ్మీలుగా వ్యవహరింపబడటానికి గత్యంతరం లేక అంగీకరించవచ్చు. భయంతో, విచారంతో వారి ఇళ్ళను, పుట్టిన గ్రామాలను వదలి వెళ్ళిపోవచ్చు. కాని రేపు న్యాయమైన వారి హక్కుల కోసం తప్పక ఉద్యమిస్తారు. భవిష్యత్తులో ఏమి జరగనున్నదో ఎవరికి తెలుసు?

నేను పాకిస్థాన్ ప్రభుత్వంలో కొనసాగటం వల్ల హిందువులకు ఎటువంటి మేలు జరగదని తేటతెల్లమయ్యాక నేను

ఇక్కడ ఉన్న హిందువులకు కాని, వెలుపల ఉన్న హిందువులకు గాని తప్పుడు సంకేతాలు ఇవ్వకూడదు. హిందువులు పాకిస్థాన్‌లో గౌరవంతో బ్రతక గల్గుతారని, వారి ఆస్తికి గాని,ధన,మాన,ప్రాణాలకు గాని, మతానికి, ధర్మానికి గాని ఎటువంటి భంగం కలుగదనే తప్పుడు సంకేతాలు ఇవ్వటం నాకు ఇష్టం లేదు. అట్లా ఇవ్వటానికి నా అంతరాత్మ ఒప్పుకోదు.

**ముస్లింలకు కూడా పౌరస్వేచ్ఛలు లేవు:**

పాకిస్థాన్‌లో ముస్లింలకు కూడా పౌరస్వేచ్ఛలు లేవు. సరిహద్దు గాంధీ, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌కు, ఆయన సోదరుడైన డా॥ ఖాన్ సాహెబ్‌కు ఏమి జరిగింది? వాయవ్య ప్రాంతానికి చెందిన అనేక మంది ముస్లిం నాయకులు, తూర్పు ప్రాంతానికి చెందిన ముస్లిం నాయకులతో పాటు జైళ్ళలో మగ్గుతున్నారు. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి సుహ్రవర్దీ ఇప్పుడు పాకిస్థాన్‌లో ఒక ఖైదీ మాదిరిగా బ్రతుకుతున్నాడు. ఆయన ఎక్కడకు వెళ్ళాలన్నా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఆయనవల్లనే అవిభక్త భారతదేశంలో బెంగాల్‌లో ముస్లింలీగ్ అధికారాన్ని చేజిక్కించుకొన్నది. ఆయన ఎక్కడా పెదవి విప్పి ఇప్పుడు మాట్లాడడు. లాహోర్ తీర్మాన రచయిత డా॥ ఫజుల్ హుక్ దిక్కులేనివాడయి ఢాకా హైకోర్టులో కేసులు ఎదుర్కొంటున్నాడు. తూర్పు బెంగాల్ ముస్లింల గురించి ఎంత తక్కువ చెపితే అంత మంచిది. లాహోర్‌లో బెంగాల్ ఒక స్వతంత్ర రాష్ట్రంగా ఉంటుదన్న హామీ ఇచ్చారు. సర్వసత్తాక, స్వతంత్ర విభాగాలు రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తామని హామీని ఇచ్చారు. దానికి బదులుగా వారికి ఏమి వచ్చింది?

తూర్పు బెంగాల్ పాకిస్థాన్ వలస ప్రాంతం అయింది.పాకిస్థాన్‌లో మిగిలిన అన్ని ప్రాంతాల కంటే జనాభా తూర్పు బెంగాల్‌లోనే ఎక్కువ. కాని కరాచీ పాలకులకు తూర్పు బెంగాల్ ఊడిగం చేస్తున్నది. పశ్చిమ పాకిస్థాన్ వారి ఆదేశాలను కిమ్మనకుండా అమలు చేస్తున్నది. పాకిస్థాన్‌లో తూర్పు బెంగాల్ ప్రజలు అత్యుత్సాహంతో విలీనం అయ్యారు. వారి జీవనం మెరుగుపడుతుందని, సిరిసంపదలు పెరుగుతాయని ఆశించిన వారికి దొరికింది సింధు, పంజాబు ప్రాంత ఎందుకూ పనికి రాని రాళ్ళు మాత్రమే.ఇస్లామిక్ స్టేట్, షరియత్‌ల నిగూఢ పనితనం కారణంగా వారికి దొరికింది మట్టి, రాళ్ళు మాత్రమే.

**విషాదకర చేదు అనుభవం:**

పాకిస్థాన్, దాని యొక్క క్రూరత్వం, హిందువుల పట్ల వివక్ష అందరికీ తెలిసినవే.నా వ్యక్తిగత అనుభవం సైతం అత్యంత విచారకరం. విషాదగ్రస్తం కూడా. చేదు అనుభవాలతో నా గుండె బరువెక్కింది. అయితే ఆ అనుభవం నా కళ్ళు తెరిపించింది.

ప్రధాన మంత్రిగా సెప్టెంబరు 8న ప్రకటన ఇమ్మని నన్ను అడిగారు. మీ మాట కాదనలేక మీ మంత్రి వర్గ సభ్యుడిగా మీకు అనుకూల ప్రకటనను ఇచ్చాను. కాని అసత్యాలు, అర్ధసత్యాలలో కూడిన ప్రకటనలు ఇవ్వటానికి నా మనస్సాక్షి ఒప్పుకోదని మీకు తెలుసు. అయితే మీ మంత్రి వర్గ సహచరుడిగా ఉన్నంత వరకు మీ అభ్యర్థనను తిరస్కరించలేను. ఎల్లకాలం నేను ఈ భారం మోయలేను. అసత్యాలతో నా అంతరాత్మను నేను మోసం చేయలేను. అందుకే నా రాజీనామా పత్రాన్ని మీ చేతుల్లో పెడుతున్నాను. జాప్యం లేకుండా దాన్ని మీరు అంగీకరిస్తారని ఆశిస్తాను.

నాకు మీరు న్యాయశాఖ మంత్రిగా పదవిని ఇచ్చారు. ఆ మంత్రిత్వ శాఖను మీరు కొనసాగించవచ్చు లేదా రద్దు చేయవచ్చు. లేదా మీ ఇస్లామిక్ స్టేట్ లక్ష్యాలకు అనుగుణంగా మార్పు చేసుకోవచ్చు. ఆ స్వేచ్ఛ మీకు ఉంటుంది.

08.10.1950

**ఇట్లు**

**జోగేంద్రనాథ్ మండల్**

తెలుగు సేత

డా॥బొమ్మరాజు సారంగపాణి